క్లుప్తంగా

ఘనంగా ఆర్యవైశ్య కార్తీక వన సమారాధన



ఆంజనేయనగరంలోని తోటలో జమ్మి చెట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళలు

భీమడోలు: భీమడోలు మండల ఆర్యవైశ్య కార్తీక వన సమారాధన మహోత్సవ వేడుక ఆదివారం ఘనంగా నిర్వహించారు. పోలసానిపల్లి పంచాయతీ శివారు ఆంజనేయనగరంలో తోటలో భీమడోలు, పాతూరు, సూరప్పగూడెం, పోలసానిపల్లి, పంగిడిగూడెం, అంబర్‌పేటకు చెందిన ఆర్యవైశ్య కుటుంబాలు కార్తీక వన సమారాధనలో పాల్గొన్నారు. వారంతా తమ ఇష్టదైవం వాసవి మాతను ప్రార్థించి జమ్మి చెట్టుకు పూజలు చేసారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సందడి చేశారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పెద్దలు, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.

పాటిమ్మ తల్లికి బోనాలు సమర్పణ

దెందులూరు: మండలంలోని పేరుపొందిన చల్ల చింతలపూడి- పెరుగ్గూడెం- తిమ్మన్నగూడెం- గ్రామాల మధ్య వెలసిన గ్రామ దేవత పాటిమ్మ తల్లికి పెరుగ్గూడెం మాజీ సర్పంచ్, పాటిమ్మ తల్లి దేవస్థానం ఆలయ కమిటీ చైర్మన్ యలమర్తి హేమ శ్రీనివాస్ దంపతులు అమ్మవారికి నైవేద్యంగా బోనాలను సమర్పించారు. ఆదివారం పాటిమ్మ తల్లి అమ్మవారికి పట్టు వస్త్రం చీర సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాటమ్మ తల్లి దేవస్థానం కమిటీ చైర్మన్ యలమర్తి శ్రీనివాస్ హేమలత దంపతులు అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆనంద నిలయం అభివృద్ధికి కృషి

ఉంగుటూరు: ఉంగుటూరులో నిర్మిస్తున్న ఆనంద నిలయం (వృద్ధాశ్రమం) అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఆదివారం ఆనంద నిలయం కమిటీ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ధర్మరాజు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో వృద్ధాశ్రమం నిర్మించడం శుభపరిణామమన్నారు. మౌలిక వసతుల కల్పనకు సహకరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద నిలయం భవన నిర్మాణ కన్వీనర్ గుణ్ణం బుల్లియ్య, సాగిరాజు జానికి రామరాజు, పాతూరి విజయకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా క్రీస్తు రాజు మహోత్సవం



ఊరేగింపు నిర్వహిస్తున్న ఫాదర్లు

దెందులూరు: స్థానిక ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం క్రీస్తు రాజు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చర్చి ఫాదర్ జి అమ్మన్ రాజా ఆధ్వర్యంలో విశ్వాసులు, గ్రామ పెద్దలు, సంఘస్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్ పి డేవిడ్ రాజు సహాయక గురువులు కల్యాణ్, బాలరాజు, ఉపదేశి, ఉపాధ్యాయులు ఉన్నారు.

బాకీ చెల్లించాలని మృతుడి బంధువుల ఆందోళన

ఉంగుటూరు: కైకరంలో ఆదివారం ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన లారీ డ్రైవరు గుండేపల్లి ఏడుకొండలు (65) అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఆయన గతంలో శ్యామలకు రూ.3 లక్షలు అప్పుగా ఇచ్చారు. ఏడుకొండలు అంత్యక్రియలకు డబ్బు లేకపోవడంతో అతని బంధువులు శ్యామల ఇంటికి వెళ్లి వెంటనే అప్పు తిరిగి చెల్లించమని అడిగారు. దీనికి ఆమె నిరాకరించింది. దీంతో ఆగ్రహించిన ఏడుకొండలు బంధువులు శ్యామల ఇంటి ముందు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువురితో చర్చించారు. మట్టి ఖర్చులకైనా డబ్బు ఇవ్వాలని వారు కోరగా శ్యామల రూ.10 వేలు ఇవ్వడంతో మృతుడి బంధువులు వెనుతిరిగారు. దీంతో తాత్కాలికంగా సమస్య సర్దుమణిగింది.

సీతంపేటలో ఇల్లు దగ్ధం

దెందులూరు: సీతంపేటలో ఆదివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా వెంకటరత్నం ఇల్లు దగ్ధమైంది. ఇంట్లో వస్తు సామగ్రి, దుస్తులు కాలి బూడిదయ్యాయి. ఫైర్ స్టేషన్ సిబ్బందికి స్థానికులు సమాచారం అందించారు. దాదాపు లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

తగ్గిన దిగుబడి.. అన్నదాతకు దిగులు

- వర్షాలతో తగ్గిన ధాన్యం దిగుబడి
- ఎకరాకు 8 నుంచి 10 బస్తాల నష్టం
- వాతావరణం మార్పుతో పెరిగిన పెట్టుబడి
- వచ్చిన దిగుబడి సాగు ఖర్చులకు సరి
- ఆవేదనలో ఖరీఫ్ రైతులు



నిడమర్రులో ఆరబెట్టిన ధాన్యాన్ని బస్తాల్లోకి నింపుతున్న రైతులు



బువ్వనపల్లిలో ధాన్యం తూకం వేస్తున్న రైతులు

నిడమర్రు: ఖరీఫ్ సీజనులో సాగు చేసిన వరి పైరు భారీ వర్షాలు, వరదలతో దెబ్బతింది. ఆ కారణంగా ధాన్యం దిగుబడులు తగ్గాయి. ఎకరాకు 8 నుంచి 10 బస్తాలు వరకు ధాన్యం తగ్గింది. దీనికి తోడు మార్కెట్లో ధాన్యం ధరల్లోనూ పతనం కనిపిస్తోంది. మద్దతు ధరకు కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. దీంతో దిక్కుతోచటం లేదని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజనుకు ఆదిలోనే ఆటంకాలు ఏర్పడిన విషయం తెలిసిందే. వర్షాలకు వరి వెదజల్లిన మాగాణి భూముల్లో పల్లపు చేలు నీట మునిగాయి. వరుస తుపాన్ల కారణంగా అన్నదాతలకు పెట్టుబడి ఖర్చులు 20 నుంచి 30 శాతం పైగా పెరిగాయి. చేతికందిన పంటను అమ్ముకునే తరుణంలో ధాన్యం అమ్మకాల్లో రైతన్నలకు తీవ్ర నిరాశను మిగిలినట్లు అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడిపై ప్రభావం చూపిన తుపాన్లు

ఉంగుటూరు నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో ఈ ఖరీఫ్‌కు సుమారు 56 వేల ఎకరాల్లో వరి నాట్లు వేసారు. ఈ ఖరీఫ్‌లో నాట్లు నుంచి పంట చేతికి వచ్చేదాకా రైతులు వాతావారణం ప్రభావంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముంపు బారిన పడి నీట మునిగి కుళ్లిపోయిన నాట్లు స్థానంలో మరోసారి నాట్లు వేసిన వారు 30 శాతం పైగా ఉన్నట్లు రైతులు చెపుతున్నారు ఇబ్బందులున్నా పంట సాగుకు ముందుకు సాగిన రైతుల ఆశలను ఆగస్టు, సెప్టెంబరులో కురిసిన వర్షాలు, వరదలు దెబ్బతీశాయి. చేలల్లోంచి నీళ్లను బయటకు పంపి, ఎరువులు చల్లి, చీడపీడల నివారణ చర్యలతో కష్టపడి ఫలితం కోసం ఎదురుచూసినా ఫలితం లేదని స్థానిక రైతులు చెపుతున్నారు. నిడమర్రు మండలంలో వెదజల్లిన వరి చేలల్లో 10 రోజుల నుంచి రైతులు యంత్రాలతో కోత, నూర్పిడి చేస్తున్నారు. బువ్వనపల్లి, ఎనికేపల్లి, అడవికొలను, చానమిల్లి, మందలపర్రులోని రైతులు ధాన్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి.

ఎక్కడ చూసినా తగ్గిన దిగుబడి

గతేడాది ఎకరాకు ధాన్యం దిగుబడి 35-45 బస్తాలు రాగా, ప్రస్తుత ఖరీఫ్ సీజను పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఎకరాకు కేవలం 30-35 బస్తాలు మాత్రమే దిగుబడి వస్తోందని రైతులు చెపుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఎకరాకు 10 బస్తాల వరకు ధాన్యం దిగుబడి తగ్గింది. గింజలు పాలు పోసుకునే సయయంలో వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల గింజలు గట్టి పడలేదు. అధిక ఉష్ణోగ్రతలు, అధిక వర్షాల వల్ల తెగుళ్ల వ్యాప్తి చెందాయి. దీంతో పంట దిగుబడిపై ప్రభావం చూపినట్లు అధికారులు అంటున్నారు. ఉంగుటూరు నియోజకవర్గం పరిధిలోని డెల్టా గ్రామాల్లో అత్యధిక విస్తీర్ణం కౌలు సాగేనన్న విషయం తెలిసిందే. ఎకరాకు రూ.22 వేల నుంచి రూ.25 వేల వరకు కౌలు చెల్లిస్తున్నారు. మరో రూ.25 వేలు పెట్టుబడి అవుతోంది. కౌలు రైతులకు ధాన్యం దిగుబడి తగ్గిపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎకరాకు రూ.20 వేలు నష్టం



సాగు చేసిన ఏడెకరాల్లో దిగుబడి అంతంత మాత్రమే వచ్చింది. మద్దతు ధర కోసం నాలుగు రోజులు ఆగుదామనుకుంటే వాతావరణం సరిగాలేదు. గతేడాది 75 కిలోల బస్తా రూ.2,100 ధర వచ్చింది. నేడు తేమ లెక్కలు చూపించి రూ.1,400 నుంచి రూ.1,500 వరకూ కొనుగోలు చేస్తున్నారు. ధర లేకపోవడం, దిగుబడి తగ్గడంతో ఎకరాకు రూ.20 వేలు వరకూ రైతులు నష్టపోతున్నారు.

– సంకు తాతాజి, రైతు, బువ్వనపల్లి

రబీ పంట ఆదుకుంటేనే గట్టెక్కుతాం



ఆరెకరాల మాగాణి కౌలుకు తీసుకుని వరి సాగు చేశాను. తుపాన్లు, వాతావరణంలో మార్పులు కారణంగా ఎకరాకు 8 బస్తాలు వరకూ దిగుబడి తగ్గింది. దీనిలో మగతా 15 బస్తాలు ఇవ్వాలి. మిగిలింది పెట్టుబడులకు పోతుంది. దీంతో ఈ ఖరీఫ్‌లో నష్టం వచ్చింది. రబీ పంటపైనే ఆశలున్నాయి. రబీ ఆదుకుంటేనే గట్టెక్కుతాను.

– ఎస్.ఆంజేయులు, కౌలు రైతు, బువ్వనపల్లి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సంకు నాగశేషు

నిడమర్రు: ఆన్‌లైన్‌లో వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని పంచుకునేటప్పుడు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వినియోగదారుల హక్కుల కమిషన్ (ఎన్‌సీఆర్‌సీ) జిల్లా వైస్ చైర్మన్ సంకు నాగశేషు అన్నారు. ఆదివారం బువ్వనపల్లిలోని ఎన్‌సీఆర్‌సీ ఈస్ట్ జోన్ కార్యాలయంలో గణపవరం సిటీ ఇన్‌చార్జ్ కొత్యాల కార్తీక్ అధ్యక్షతన సైబర్ నేరాలపై వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన నాగుశేషు మాట్లాడుతూ మీ వ్యక్తిగత రక్షించుకోవడం, ఆన్‌లైన్ మోసాల పట్ల అవగాహన కలిగి ఉంటే ఆన్‌లైన్‌లో ఆర్థిక మోసాలను అడ్డుకోవచ్చన్నారు. స్మార్ట్ ఫోన్ వినియోదారులే ఎక్కువగా ఆన్‌లైన్ మోసాల బారిన పడుతున్నారన్నారు. పేటీఎం, ఫోన్‌పే, గూగుల్ పే వంటి యాప్‌లు వినిగించేవారు ఒకటికి రెండు సార్లు వాటి పనితీరు ఖాతాలోని నగదు బ్యాలెన్స్ చెక్ చేసుకోవడం మంచిదన్నారు. తెలియని నంబర్ల నుంచి వచ్చే ఎస్ఎంఎస్ లింకులు, ఏపీకే ఫైల్స్ వంటివి క్లిక్ చేయవద్దని మొబైల్ వినియోగదారులను కోరారు. ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించేందుకు ఎన్‌సీఆర్‌సీ జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ చైర్మన్ నోచర్ల శ్రీనివాసరావు, సభ్యులు పెదకాపు తదితరులున్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట మహాధర్నా



కైకరం సెంటర్లో ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

ఉంగుటూరు: రైతుల సమస్యలపై కలెక్టరేట్ ఎదుట మహాధర్నా ఈనెల 26న నిర్వహిస్తామని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్ వెల్లడించారు. ఈ మహాధర్నాలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆదివారం ప్రచార కార్యక్రమం కైకరంలో ప్రారంభించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా బాస్కరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కోర్ని అప్పారావు మాట్లాడుతూ కేంద్ర విధానాలు వ్యవసాయానికి కార్మిక వర్గానికి హాని కలిగిస్తోందని అన్నారు. ఈ నేపథ్యంలో నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా 500 జిల్లాల్లో భారీ ఎత్తున రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు ఇతర ప్రజా సంఘాలు సమీకృతమై న్యాయమైన డిమాండ్ల సాధనకు ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక పూజలు



గుండుగొలనులో ప్రత్యేక అలంకరణలో స్వామి వారు



భీమడోలులో భక్తుల పూజలందుకున్న భీమేశ్వర స్వామి

భీమడోలు: కార్తీక మాసోత్సవంలో భాగంగా ఆదివారం శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, పోలసానిపల్లి, అంబర్‌పేట తదితర గ్రామాల్లో స్వయంభువుగా వెలసిన శివాలయాల్లో తెల్లవారుజాము నుంచి విశేష పూజలు చేసారు. గుండుగొలనులోని భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. స్వామి వారికి ప్రత్యేకంగా లక్ష బిల్వార్చన చేశారు. ఆలయ పూజారి లంకా శివకుమార్, లంకా శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భీమడోలులోని పార్వతీ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు.

నేటి నుంచి 108 ఉద్యోగుల సమ్మె బాట

- 15 డిమాండ్ల సాధన కోసం పట్టు
- నిలిచిపోనున్న అత్యవసర సేవలు



తమ సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలుపుతున్న 108 సిబ్బంది

బుట్టాయగూడెం: అపర సంజీవని 108 అంబులెన్స్ సేవలు నేటి నుంచి నిలిచిపోనున్నాయి. ప్రజలకు అత్యవసరంగా తమ వంతు సాయం అందిస్తూ ప్రజల ప్రాణాలు కాపాడే 108 సిబ్బంది నేటి నుంచి సమ్మె బాట పట్టనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక 108 సిబ్బంది పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుంది. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇప్పటికే సిబ్బంది పలు నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ నెల 25లోగా ప్రభుత్వం స్పందించకపోతే సేవలు నిలిపివేస్తామంటూ స్పష్టం చేశారు. ఇప్పటికే ముందస్తు నోటీసులను ఉన్నతాధికారులకు అందజేశారు. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నేటి నుంచి 108 అంబులెన్స్ సేవలను నిలిపివేస్తూ సిబ్బంది సమ్మెబాట పట్టనున్నారు.

రోగులకు అవస్థలే

24 గంటలు అత్యవసర సేవలు అందిస్తున్న 108 ఉద్యోగులు సమ్మెబాట పట్టడం వల్ల రోగులకు పాట్లు తప్పవని అనిపిస్తుంది. ఇప్పటికే పలు మండలాల్లో 108 వాహనాల మరమ్మతు పేరుతో సేవలు దూరమయ్యాయి. ఇప్పుడు సిబ్బంది సమ్మెబాట పట్టడం వల్ల డయాలసిస్ రోగులు, గర్భిణులు, రోడ్డు ప్రమాదాల బారిన పడే క్షతగాత్రులను తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

108 ఉద్యోగుల డిమాండ్లు ఇవే

- 108 సర్వీసులోని ఉద్యోగులను వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులుగా గుర్తించి నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలి.
- జీఓ నెంబర్ 49ను పునరుద్ధరించాలి. ఫైలట్ గ్రాట్యుటీ, ఎర్నడ్ లీవు అమౌంట్ (అర్హత సెలవు మొత్తం) వార్షిక ఇంక్రిమెంట్‌ను చెల్లించాలి.
- ప్రతీ నెలా జీతాల చెల్లింపు 5లోగా జరగాలి. 108 వాహనంలో షిఫ్టుల పద్దతే అమలు చేయాలి.
- వైద్య ఆరోగ్యశాఖలో చేపట్టే నియామకాల్లో సర్వీసుకు అనుగుణంగా వెయిటేజ్ మార్కులు అందించాలి.
- విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి మరణించిన తర్వాత బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా రూ.20 లక్షలు ఇవ్వాలి.
- 108 సర్వీసులో ఈఎంటీల సర్వీసును పరిగణనలోకి తీసుకుని వైద్య ఆరోగ్యశాఖలో డీఎంఈ ద్వారా మెడికల్ కాలేజీలలో చేపడుతున్న ఈఎంటీ పోస్టులను నియమించాలి.
- రెండు షిఫ్టులలో షిఫ్టుకు 12 గంటల చొప్పున తీవ్ర ఒత్తిడిలో పనిచేస్తున్న తమకు మూడు షిఫ్టులలో రోజుకు 8 గంటల పనిదినాన్ని అమలు పరచాలి.
- వాహనాలను సరైన కండీషన్‌లో ఉంచాలి. వాహనం మరమ్మతు బిల్లులు ఉద్యోగులకు వెంటనే చెల్లించాలి.
- 108 వాహనానికి, దానిలో పనిచేస్తున్న సిబ్బందికి కనీస అవసరాలతో కూడిన భవనాన్ని నిర్మించాలి.

నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు



ఎంఈవో శేషును సన్మానిస్తున్న వాసుబాబు, ఎంపీపీలు

గణపవరం: సమాజంలోని అవ లక్షణాలను తొలగించి, నవ సమాజాన్ని నిర్మించే మహత్తర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని వారు వృత్తిధర్మాన్ని చిత్తశుద్ధితో నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యేలు పుప్పాల వాసుబాబు, గన్ని వీరాంజనేయులు అన్నారు. ఈనెలాఖరున పదవీ విరమణ చేయనున్న గణపవరం, నిడమర్రు మండలాల ఎంఈవో పుచ్చల శేషును రెండు మండలాల ఉపాధ్యాయ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆదివారం టీటీడీ కల్యాణ మండపంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు గణపవరం, నిడమర్రు మండలాల ఎంఈవో-2 గొర్రెల బాలయ్య అధ్యక్షత వహించారు. ఈ సభలో పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారంతా గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులేనని, వారికి విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నత స్థితికి తీసుకురావడానికి ఉపాధ్యాయులు నిరంతరం శ్రమించాలని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చి ప్రభుత్వ పాఠశాలలను కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేసిందని, ప్రస్తుత ప్రభుత్వంపై ఆ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ భావిభారత పౌరులను తీర్చిద్దే ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలన్నారు. సభలో గణపవరం, నిడమర్రు మండలాల ఎంపీపీలు అర్ధవరం రాము, ధనుకొండ ఆదిలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు దేవారపు సోమలక్ష్మి, కోడే కాశీ, గణపవరం సర్పంచ్ మూర అలంకారం, ఎంపీడీవో శ్రీలక్ష్మి, తహసీల్దార్ అప్పారావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రెండు మండలాల ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసుబాబు, గన్ని వీరాంజనేయులు, ఇతర మండల ప్రజాప్రతినిధులు ఎంఈవో శేషు దంపతులను పూలమాలలతో, దుశ్శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

వైభవంగా తిరుప్పావడ సేవ



అర్ధవరంలో బాలవేంకటేశ్వరుని ఊరేగింపు

గణపవరం: అర్ధవరంలోని శ్రీదేవీ, భూదేవి సమేత బాలవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి తిరుప్పావడ సేవ వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలు ఈ నెల 26వ తేదీ వరకూ కొనసాగుతాయని ఆలయ ఉత్సవ కమిటీ తెలిపింది. ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై వీధుల్లో ఊరేగించారు. సాగిరాజు సుబ్బరాజు, సత్యవతి దంపతులు పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు పెద్దింటి రామప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి స్వామి వారి తిరుప్పాడసేవ వైభవంగా నిర్వహించారు. స్వామివారిని, అమ్మవార్లను వివిధ పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ అందక వ్యాయామ విద్యార్థుల ఇక్కట్లు

దెందులూరు: ప్రభుత్వం స్కాలర్‌షిప్ మంజూరు చేయకపోవడంతో గోపన్నపాలెం వ్యాయామ కళాశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కళాశాలలో అండర్ గ్రాడ్యుయేషన్ డిప్లమో బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రెండు వ్యాయామ విద్య కోర్సులున్నాయి. ప్రభుత్వం స్పందించి విద్యాభ్యాసానికి ఇబ్బందులు కలగకుండా స్కాలర్‌షిప్ వెంటనే మంజూరు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చి రెండు కోర్సుల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు. కుటుంబ సభ్యులకు దూరంగా విద్యనభ్యసిస్తున్నామని, ప్రభుత్వం స్పందించి స్కాలర్‌షిప్‌లు వెంటనే మంజూరు చేసి ఆదుకోవాలని వ్యాయామ విద్య కళాశాల విద్యార్థులు కోరుతున్నారు.

పట్టాభి చేసిన సేవలు చిరస్మరణీయం



పట్టాభి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మామిళ్లపల్లి కాళీబాబు, పెద్దలు

భీమడోలు: భారత స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకుడు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య తెలుగు జాతి, తెలుగు భాషకు చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. గుండుగొలనులోని డాక్టర్ పట్టాభి సీతారామయ్య అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో పట్టాభి జన్మ స్థలం గుండుగొలనులో ఆదివారం 145వ జయంతిని ఘనంగా నిర్వహించారు. పట్టాభి సీతారామయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఏఎంసీ చైర్మన్ వగ్వాల భాస్కర్, అభ్యుదయ సంఘం అధ్యక్షుడు మామిళ్లపల్లి కాళీబాబులు మాట్లాడారు. నిరంతరం ప్రజాసేవ కోసం పరితపించే పట్టాభి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పట్టాభి ఆంధ్రాబ్యాంకును స్థాపించి విశేష సేవలందించారన్నారు. పట్టాభి సీతారామయ్య స్మారక విగ్రహాన్ని నూతన నిర్మించనున్న వంతెన వద్ద ఏర్పాటు చేయాలని పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ సంఘం కార్యదర్శి బొల్లిన కోటేశ్వరరావు, పెద్దలు అంగరాకుల సూర్యనారాయణ, బాలిన సింహాచలం, కర్రి గంగాధరరావు, వెంకట్రావు, వగ్వాల హేమసుబ్బారావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ మృతి

భీమడోలు: ఐదేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ ఏసూరి శివరాం ప్రసాద్ (32) శనివారం రాత్రి మృతి చెందాడు. అతని భార్య ఏసూరి కృష్ణకుమారి ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమడోలు పోలీసులు జీరో కేసు నమోదు చేసారు. వివరాల్లో వెళితే... కోనసీమ జిల్లా కొత్తపేట మండలం ఆవిడి గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా విధులను నిర్వర్తిస్తున్నారు. 2019, ఏప్రిల్ 7న తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా దమ్మపేట గ్రామంలో విధుల్లో భాగంగా శివరాం ప్రసాద్ తన మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా మందలపల్లి క్రాస్ రోడ్డు వద్దకు వచ్చేసరికి లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శివరాం ప్రసాద్ తలకు బలమైన గాయం తగలడంతో కోమాలోకి వెళ్లగా వివిధ ఆసుపత్రుల్లో వైద్యం చేయిస్తున్నారు. అప్పటి నుంచి శివరాం ప్రసాద్ భార్య కృష్ణకుమారి పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురంలోని తన పుట్టిల్లు వద్దనే ఉంటూ వైద్యం అందిస్తోంది. పలు ఆసుపత్రుల్లో వైద్యం చేయించినా కోలుకోలేక శివరాం ప్రసాద్ మృతి చెందినట్లు భార్య కృష్ణకుమారి తన ఫిర్యాదులో పేర్కొంది. తన భర్త మృతికి లారీ డ్రైవర్ కారణమని ఆమె భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేయగా జీరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

సీనియర్ అసిస్టెంట్ మృతికి సంతాపం

దెందులూరు: దెందులూరు తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందటం అత్యంత బాధాకరమని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శ్రీనివాసరావు కుటుంబానికి ఆయన ఆదిఆరం సంతాపం తెలియజేశారు.

నేడు వార్షిక కలశ పూజ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక దొండపాడులోని శ్రీ బాల అయ్యప్ప క్షేత్రంలో సోమవారం 13వ వార్షిక కలశ పూజ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 7 గంటలకు ఆలయ ప్రాంగణం నుంచి ఉత్సవ మూర్తితో బయలుదేరి స్థానిక పడమరలాకుల సమీపంలోని సాయిబాబా మందిరం వద్ద కృష్ణ కాలువలో ఆరాట్టు ఉత్సవం నిర్వహిస్తామన్నారు.

హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలి

ఏలూరు (మెట్రో) : ప్రతి ఒక్కరూ హెచ్ఐవీపై అవగాహన కలిగి దాని నియంత్రణ, నివారణకు కృషి చేయాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ పి బాలాజీ అన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ (ఇంటిగ్రేటెడ్, ఎస్‌టీఐ, టీబీ, హెపటైటిస్-సి, హెపటైటిస్-బీ) ఇక్షిత్ అనే కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఏలూరు జిల్లా జైల్‌లో ఖైదీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఉచితంగా హెచ్ఐవీ, టీబీ, సిఫిలిస్, హెపటైటిస్-బి, హెపటైటిస్-సి పరీక్షలు నిర్వహించారు. జిల్లా జైల్ సూపరింటెండెంట్ సీహెచ్ ఆర్‌వీ స్వామి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కె వినోద్‌కుమార్, ఐసీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.